# భారతదేశ మానవతాధర్మం భరతజాతిని నడిపించాలి!
# కృష్ణుడే ప్రేమకు, ధర్మానికి మూలపురుషుడు!
## హృదయకుహరం వంటి ఆంధ్రప్రదేశం పంచెకట్టాలి. దారితప్పని కంచె వేయాలి.




జాతికుల ప్రాంత మత వర్గ, పామర, పండిత, పట్టణ, నగర, నదీనద, పశు, పక్షి, వృక్ష, పృథ్వీ, సాగర, గిరి, తరురక్షణల కర్తవ్యాన్ని పౌరుడే వహించాలి. అప్పుడే సర్వజీవ సహజ కారుణ్యం ప్రాపంచిక కార్యకలాపమవుతుంది. క్షమ, దయ, సమర్పణం, సమధర్మం, సమత, మమత, సత్యత, సఖ్యత, వినయం, వివేకం, వితరణలతో మానవతా ధర్మవిస్తరణం జరుగుతుంది. నిర్మలమైన, నిశ్చలమైన, నిజాయితీగల ప్రేమ అంకురిస్తుంది. నిండుకుండలోని నీటి బిందువులులా కలిసికట్టు వాతావరణం ఏర్పడుతుంది.

అందుకు మార్గం ఉన్నదా? అంటే ఉన్నది. భగవద్గీతాపఠనం– భాగవత శ్రవణం, రాధాకృష్ణ, మనోహర రంజిత దర్శనం. ఏకాన్ని ద్వితీయం చేసి, ద్వితీయత్వంలో ఏకత్వ తత్వం చూపడమే రాధా కృష్ణ తత్వం, రాసకేళీరసత్వం! రసరమ్య రమ్యత్వం ఎంతమందెరుగుదరు.

ఎప్పటివాడు కృష్ణుడు! ఎన్నేళ్ల నాటివాడు! ఆ గీత ఎన్నేళ్ళనాటిది? ఆ భాగవతం. ఎన్నేళ్ళనాటిది?

ఐదువేల ఏళ్ళనాటి వాడు కృష్ణుడు! ధర్మక్షేత్రమైన కురుక్షేత్ర రణక్షేత్రం మధ్య పార్థునికి క్షాత్రధర్మం చెబుతూ, మధ్యలో ధర్మసూక్ష్మాలను, చెప్పాడు. ధర్మాచరణ మార్గం చెప్పాడు.

ఆయన అందించిన బోధ, మానవ హృదయాంతర్గత చైతన్యాన్ని మేల్కొలిపి, మనిషిని కర్తవ్యోన్ముఖుణ్ణి చేయగల శక్తివంతమైన ప్రబోధం. అది సార్వకాలికం. సార్వజనీనం!

* ధర్మాన్ని స్మరించు – ధర్మాన్ని ఆచరించు' అన్న బోధ మనిషికి ఆనంద మార్గాన్ని సిద్ధం చేస్తుంది. ఎవరు చేయవలసిన పనిని వారు సక్రమంగా, సలక్షణంగా, సర్వజన హితంగా చేయటమే ధర్మం.

* సమస్త మానవజాతి, పరస్పరం యోగక్షేమాలను వహిస్తూ, ప్రేమ– సేవలను సమన్వయం చేసుకోగలిగితే జీవితం నందనవనం అవుతుంది.

* కష్టం ఒక కర్మనిష్ఠ, మనిషిని జాగృతం చేసే మహత్తర భూమిక, తనను తాను నిగ్రహించుకుని, సంస్కరించుకోగల అవకాశం లభించినప్పుడు, ఎంతటి కష్టమైనా ఒక యోగమై నిలుస్తుంది.

* కర్మలు చేస్తూ వుండాల్సిందే. కర్మానుభవాలు నిలబడాలి. కర్మల వలన లభించే లాభాలను వదలుకోవాలి. అపేక్ష నుండీ ఉపేక్ష వైపు మనసును మళ్ళించాలి. అది శాంతిని ప్రసాదిస్తుంది.

* కోరికలు తగ్గించుకుంటుంటే మనసు నెమ్మదిస్తుంది. అది స్థిత ప్రజ్ఞను అనుగ్రహిస్తుంది.

* మనిషి ఉత్తముడు, ఉన్నతుడు కావాలి. ఆలోచన – ఆదరణల మధ్య సమన్వయం వుండాలి. సంఘర్షణలేని జీవితం, ఇతరులకు ఆనందాన్ని ఆదర్శాన్ని అందిస్తుంది.

* మానవ జన్మల కర్మల వలన ఏర్పడింది. సత్కర్మలతో దాన్ని మరింత సుందరతమం చేయాలి. మనం మంచిని ఆచరిస్తే ఫలితం లోకానంతటికీ చెందుతుంది.

* వైరాగ్యమే అసలు సంపద. వైభోగం నశించవచ్చు. అది దుఃఖకారిణి. అన్నీ వున్నా, ఏవీ తనవి కావన్న భావనలో వుండటమే వైరాగ్యం.

* సుఖం, సంతోషం తాత్కాలికమైనవి. ఆనందమే శాశ్వతమైనది.

* బ్రహ్మనిష్ట గల వాడే బ్రాహ్మణుడు.. అసత్యాన్ని ధిక్కరించువాడు క్షత్రియుడు.. నిరంతరం కృషి సలుపువాడు వైశ్యుడు.. కర్మనిష్ఠాపరుడే శూద్రుడు.. ఈ నాలుగు స్థితుల సమగ్రత్వమే మానవత్వం. వీరిలో హెచ్చుతగ్గులు లేవు.

* తత్త్వవేత్త, దేహాభిమానంలేని వాడు, నిత్యత్యాగి, శాంతం, వైరాగ్యం, కరుణ, మధుర వాక్కు, సచ్చరిత్ర కలవాడే గురువు.

* సమర్పణ, శరణాగతి, వినయం, శ్రద్ధ, ఏకాగ్రత – ఓర్పు కలవాడే శిష్యుడు.

* అధ్యయనం, అభ్యాసం, ఆదరణ వుండే లోకంలో అసాధ్యమన్నది లేదు.

* అంతర్గత శక్తే గురువు, దానిని ఎల్లవేళలా గుర్తెరిగి వర్తించాలి. ధ్యాన, జ్ఞాన యోగాల ద్వారా శక్తిని వృద్ధి చేసుకోవాలి. ఆ శక్తిని సమాజహితం కోసం వెచ్చించాలి.

* ఉత్తమ భావం, ఉత్తమ రూపం, ఉత్తమ కర్మలే దైవం, దేవ అంటే ఆట, దైవం అంటే ఆడించేవాడు. ఆడుకునేవాడు. దైవంతో ఆడగలిగిన వాడు మానవుడు, ప్రజ్ఞకున్న రెండు కోణాలవి.

* మంచి మాటలను వినటం శ్రవణ సత్యం.

ఆచరించవలసిన విధానం చెప్పాడు. కర్మసాంఖ్య యోగాలను చెప్పాడు. అందరూ కర్మబద్ధులు కర్మ చేయాలన్నాడు. తనకు అవసరం లేనిదైనా, తాను కర్మాచరణం చేస్తున్నానన్నాడు. తాను కర్మనాచరించకపోతే ప్రపంచమే అంతరించిపోతుంది. చరాచర సృష్టి స్తంభించి పోతుందని, పార్థాకర్మను ఆచరించు అన్నాడు.

ఈ ధర్మమార్గగ్రంథాన్ని ఎన్నోవేల ఏళ్ళనుంచీ ఎంతోమంది మునులు అవధూతలు, ఆచార్యులు బోధన చేస్తూనే ఉన్నారు. అందరూ వింటున్నారు. కానీ ఎంతమంది ఆచరిస్తున్నారు? ఏఏ మనుజుల మస్తికాల్లో ఉన్ననూ, పుస్తకమస్తకాన్నీ బోధించినవారు కాని, బోధింపబడినవారుగానీ ఆచరించడం లేదు. మనశ్శాంతిని పొందడం లేదు. గ్రంథస్తం చేసిన వ్యాసునికే మనశ్శాంతి కలుగలేదు. అందుకే నారదబోధతో వ్యాసుడు 'మహాభాగవత' రచన చేసాడు. ఆ ముక్తిప్రదమైన 'భాగవతాన్ని' వ్యాసుల వారి పుత్రుడు, పార్థుని పౌత్రుడైన పరీక్షిన్మహారాజుకు ఏడు రోజుల్లో చెప్పి ముక్తిమార్గాన్ని పొందేట్లు చేసాడు. దాన్ని తెనుగీకరించడంలో 'తేనె' వంటి తియ్యని మకరందాన్ని పూసి మదాంధ్ర భాగతం చిరకాలం ఉండేట్టు జిహ్వాకు రుచ్యమై, నాలుక రసవత్తరమయ్యేట్టు పోతన చెప్పాడు. చెవులూరే ఆ పద్యమకరంద్రాన్ని గ్రోలడమే తక్క, గ్రోలినది శరీరగోళంలో నిక్షిప్తమయ్యేట్టు జాగరూకం వహించినవారు లేరు. రాధచరితం ఆయన పరిగణనకు తీసుకోలేదు. రాధ లేనిదే కృష్ణుడు లేడనీ కృష్ణుడు శరీరం రెండుగా చీలి రాధయైందనీ, సృష్టిలోని అందమంతా ఆమెయందు మూటకట్టి ఉందనీ ప్రస్తుతం నేనెరిగిన రచనాభోగట్టాను, ఓ చిత్తాగా మీకు వినిపిస్తున్నాను. ఐహిక విషయాలను విడిచి చదవండి. ఇవన్నీ చంద్రశేఖరానుగ్రహ సంస్తుతులే!

ఇక ప్రేమ వ్యవహారాల్లో పరస్పర సుఖాభిలాష అమితంగా ఉంటుంది. కానీ భగవత్పరమైన పరమ ప్రేమ నిస్వార్థ పూరితం. పరిపూర్ణ త్యాగపూరితం కనుక ఇది అత్యుత్తమం. ఉత్తమోత్తం. కామాంధులు తమ ఇంద్రియ సుఖాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. కాని పరమ ప్రేమ స్వరూపులైన భక్తులు పరసుఖం ధ్యేయంగా, పరమసుఖం లక్ష్యంగా, పరోపకారం గమ్యంగా భావించి, ఆచరించి తరిస్తారు. గోపికలు పరిపూర్ణ భక్తి భావకులు, త్యాగమయులు, గోపికలకి తమ సుఖాన్ని గురించిన తపన లేదు. తమ భవిష్యత్తును గురించిన ధ్యాస లేదు. పరాత్పరుని సుఖం కోసమే, తపనపడతారు. తపఃపడతారు.

శ్రీకృష్ణపరమైన ప్రేమలో కామం ఉండదు. శ్రీకృష్ణభక్తులు కాముకులు కారు. మూర్ఖులు, మూఢులు నాస్తికులు భావించినట్లు శ్రీకృష్ణ పరమాత్మ కాముడు కానే కాదు. ఆ పరమాత్మ ప్రేమ స్వరూపుడు. సర్వాంతర్యామి. అంతర్యామి, సకల మునిజన సేవ్యుడు. అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు. వాఙ్మయ సంస్తవ్యుడు. సంభావ్యుడు. గోపికలు కోరుకున్నది ఆ పరంధాముని సన్నిధానం. గోపికలు అనుభవించినది ఆత్మానందం, ఏకాత్మ భావనను. గోప గోపాలురు తమ సర్వస్వాన్ని శ్రీకృష్ణ దేవుని

